కథానిక :

# "ఆల్కెమీ"

"జానకీ జాని"

'అన్నం వడ్డించాను నాన్నా'.

గుమ్మం దగ్గర నిలబడి మెల్లిగా అంది విమల. 'వచ్చేస్తున్నానమ్మా' టెస్ట్ ట్యూబుని తదేక ధ్యానంతో చూస్తూ అన్నాడు ప్రొఫెసర్ రాజశేఖరం. టెస్ట్ ట్యూబులో ద్రవంలాగే అతని ముఖమూ రంగులు మార్చుకుంటోంది. అంతలో ఆనందం, అంతలో నిరాశ, అంతలో ఉత్సాహం, అంతలోనే విసుగూ— పరస్పర విరుద్ధాలైన భావాలు అతని మనస్సులో ఒక వలయం మీద నిలబడి ఒకదాన్నొకటి తరుము కుంటూ పోతున్నాయి. దృష్టిని టెస్ట్‌ట్యూబు మీదే కేంద్రీకరిస్తూ ఆలోచిస్తున్నాడు రాజశేఖరం.

'నాన్నా, అన్నం చల్లారిపోతోంది'. నిశ్శబ్దాన్ని ఛేదిస్తూ అంది విమల.

'ఒక్క నిమిషం తల్లీ, వచ్చేస్తున్నాను.'

అటు తిరక్కుండానే అన్నాడు రాజశేఖరం. ఈ సమాధానాలకి రాజశేఖరం ఆలస్యానికీ అలవాటుపడ్డ విమల గదిలోంచి డైనింగ్ హాలులోకి దారి తీసింది.

రాజశేఖరం మరో టెస్టు ట్యూబులోకి ఇంకో రకం ద్రవం తీసుకుని పరిశోధన కొనసాగిస్తూనే వున్నా, అతని మనస్సు మాత్రం ఏవేవో ఆలోచన లతో సుళ్లు తిరుగుతూనే వుంది.

మూడేళ్ల క్రితం కెమిస్ట్రీ ప్రొఫెసర్‌గా రిటైరయి ఇంట్లోనే లేబొరేటరీ ఏర్పాటు చేసుకున్నాడు రాజశేఖరం. అంతవరకూ ఎందరో ప్రయత్నించిందీ, ఎవరూ సఫలం కానిదీ అయిన దాంట్లో విజయం సాధించాలని అతని ఆశయం. 'మిస్టర్ రాజశేఖరం, నీ ఆలోచనే నీదిగాని, బేస్ మెటల్స్‌ని బంగారంగా మార్చగలంటయ్యా. వృధా ప్రయత్నం మాని ఇంకేదైనా ఉపయోగకరమైన పని పెట్టుకో''

రెండేళ్ల క్రితమే సలహా యిచ్చాడు తనతోపాటే రిటైరయిన ఇంగ్లీషు ప్రొఫెసర్ విశ్వనాథం. ఎవరెన్ని విధాల చెబుతున్నా రాజశేఖరం నిర్ణయం సడలలేదు. ఆ లేబొరేటరీలోనే నిద్రాహారాలు లేకుండా గడపటం అతనికి ఇంచుమించు దినచర్యగా పరిణమించింది.

ఇక రెండేళ్లకి రిటైరవుతాడనగా రాజశేఖరానికి భార్యావియోగం కలిగింది. విశాలమైన కాళీస్థలంలో అన్ని హంగులూ వుండేటట్టు మేడ కట్టుకున్నాక అన్నింటినీ వదలిపెట్టి వెళ్లిపోయిందామె. ఉన్న ఒక్క కూతుర్నీ చదివిస్తూ కాలక్షేపానికని పెట్టుకున్న ఈ కార్యక్రమం అతనికో వ్యసనంలా పరిణమించింది. తను అందులో చిక్కుకున్నాడు. ఫలితం సాధించనూ లేదు. పని విరమించనూ లేదు.

ఆ పూటకి పరిశోధన ఆపి గదినుంచి బయటకు నడిచాడు రాజశేఖరం. ఎదురుగా కిటికీ గుమ్మం దగ్గర నుంచుంది విమల. అతని మనస్సు చివుక్కుమంది.

"విమలకి పెళ్లీడు వచ్చింది. మంచి సంబంధం చూసి పెళ్లి చేసెయ్యాలి." విమల కిటికీ దగ్గర నుంచోటం చూసినప్పుడల్లా అనుకుంటాడు రాజశేఖరం. తను లేబొరేటరీలో అడుగు పెట్టగానే అన్నీ

మరచిపోతాడు. రాజశేఖరం మనస్సులో చెప్పలేనంత వేగంగా వీస్తోంది ఈదురుగాలి.

అతనికి నెలరోజుల క్రితం జరిగిన సంగతి జ్ఞాపకం వచ్చింది. కిటికీ దగ్గర నుంచున్న విమలవెనకే వెళ్లి తనూకిందకి చూశాడు. అప్పటికిగాని అతనికి అర్థం కాలేదు. రోజుకి ఎన్నో సార్లు తన ఇంటి ముందు నుంచి వెళ్లటానికి కారణం. అతనికి విమలమీదకంటె తనమీదే ఎక్కువ కోపం వచ్చింది.

'నిజమే తప్పు విమలది కాదు. వయస్సుది. ఇంకా ఆలోచిస్తే తనది.'

రాజశేఖరం తాపీగా అనుకున్నాడు. ఆ సాయంత్రం తను షికారుకి వెళ్లి తిరిగి వస్తూండగా ఇంటి గేటు దగ్గర నిలబడ్డ కుర్రాణ్ణి పరీక్షగా చూశాడు. అతను తనదగ్గిర చదువుకున్నవాడే. తననిచూసి కంగారు పడిపోయాడు. మెల్లిగా బుజంమీద చెయ్యివేస్తూ అన్నాడు. 'చూడు మిస్టర్. ఇటువంటి పనులు నాకు గిట్టవ్. నీకు నిజంగా విమలని పెళ్లి చేసుకోవాలనుంటే మీ తల్లి దండ్రులని సంప్రతించి, అప్పుడు నా దగ్గరకు రా. అంతేగాని పొద్దస్తమానమూ ఇక్కడ పేరేడ్ చెయ్యటం ఏమీ బాగుండదు.'

సమాధానం చెప్పకుండా బెరుగ్గా వెళ్లిపోతున్న కుర్రాడివంక చూస్తూ నవ్వుకున్నాడు రాజశేఖరం. ఇది జరిగి నెల కావస్తోంది. ఐనా ఆ కుర్రాడువచ్చి తనను కలుసుకోనూ లేదు ఇంటికి రావటం మాననూ లేదు.

ఎవరో ఏడుస్తున్నట్లు వినిపించటంతో ఆలోచనల్లోంచి తేరుకుని డైనింగ్ హాలులోంచి ముందు వరండాలోకి వచ్చాడు రాజశేఖరం.

ఏడుస్తున్న అసిరమ్మని ఓదారుస్తోంది విమల.

'ఏవమ్మా మళ్ళీ ఏమయింది?' ఆదుర్దాగా అడిగాడు రాజశేఖరం.

'ఏటుంది బాబూ. ఆ సచ్చినోడు తెగతాగీసి గొడ్డునా బాదీసి నాడు. అడ్డొచ్చిన పిల్లదాని ఒల్లు ఊ౦౦ం అయిపోనాది' ఏడుస్తోంది అసిరమ్మ.

'నే కనుక్కుంటాలే కాని నువ్వూరుకో. పోయి పిల్లల్ని చూసుకో' ఓదార్పు ధోరణిలో అన్నాడు రాజశేఖరం.

'అది కాదు నాన్నా, నువ్వు చంద్రిగాడికి గట్టిగా బుద్ధిచెప్పాలి. ఇక్కడికి రెండేళ్లనుంచీ సాగుతోంది ఈ భాగవతం. ఒక్కసారి పోలీసు రిపోర్టిచ్చి జైల్లో పెట్టించ రాదూ:'

అమాయికంగా అంది విమల.

'అలాగే తల్లీ. ఆ విషయం నేచూస్తాగా. నువ్వు ఇంట్లోకి పద. ఒంటిగంట కావస్తోంది. ఇంకా భోజనాలు కానేలేదు.' లోపలికి నడుస్తూ అన్నాడు రాజశేఖరం. అతని మనస్సంతా చంద్రిగాడు ఆక్రమించుకున్నాడు.

విశాలమైన స్థలంలో ఒక్కళ్ళూ వుండలేక గేటుపక్క పాకవేసి చంద్రిగాణ్ణి కావలా పెట్టాడు రాజశేఖరం. వాడు కార్ల కంపెనీలో మెకానిక్కు. అక్కడ వచ్చేజీతంకాక ఆపనీ, ఈ పనీచేసి ఎంతో సంపాదిస్తాడు. నిజానికి వాళ్లు ఆ ఇద్దరు పిల్లల్నీ పెట్టుకుని ఏంతో రాజ్యాంగంగా బతకొచ్చు. కాని చంద్రిగాడిలో అన్ని సద్గుణాలతోబాటూ ఓ రెండు మచ్చలూ వున్నాయి. వాడికి బ్రాకెట్లపిచ్చి. డబ్బంతా దానికోసం తగలేస్తాడు. అర్థం కాకపోయినా భూతద్దం కొనుక్కొని ఇంగ్లీషు పత్రికలు తిరిగేస్తాడు. తెలిసినా తెలియకపోయినా పెద్ద ఛార్టు తయారుచేసి కాళీ వున్నప్పుడల్లా చూస్తూ కూచుంటాడు.

చంద్రిగా ఎందుకురా డబ్బులా వూరికే తగలేస్తావు? బ్రాకెట్లవల్ల బాగుపడ్డవాణ్ణి ఒక్కణ్ణైనా చూశావా? పెళ్లాం పిల్లల్ని చూసుకుంటూ సుఖంగా బ్రతకలేక ఎందుకొచ్చిన పాడుబుద్ధి చెప్పు?'

రాజశేఖరం ఎన్నోసార్లు చివాట్లు వేశాడు చంద్రిగాణ్ణి. 'మానేత్తాను బాబూ. టీకొట్టు ముత్యాలికి నాలుగొందలు రానేదా? ఒక్క శాన్సు చూసి మానేత్తాను.'

చంద్రిగాడు ఈ సమాధానం రెండేళ్లనుంచీ

చెబుతున్నాడు. రాజశేఖరానికి అసిరమ్మ మీద కూడా కోపం వచ్చింది. మొగుడు డబ్బు తగలేస్తున్నప్పుడు అదెంత జాగ్రత్తగా వుండాలి? ఓ అర్ధ రూపాయి కళ్లబడితే చాలు సినిమాకి తుర్రుమంటుంది. నిజానికి అసిరమ్మ చూడని సినిమా లేదు. ఒక్కసారే చూసిన సినిమా కూడా లేదు. అదే అంటాడు చంద్రిగాడు. 'నన్నూరికే ఆడిపోసుకుంటావ్. నువ్వు సేసే పనేటే' అని ఈ మాట వాడనగానే అసిరమ్మ గుడిసెలోకి జారుకుంటుంది. చిత్రమైనవాళ్ల దాంపత్యం విషయం ఆలోచిస్తూనే ఎలాగో భోజనం అయిందనిపించాడు రాజశేఖరం.

భోజనంచేసి పడక్కుర్చీ మీదే ఓ అరగంట నడుం వాల్చటం అలవాటు రాజశేఖరానికి. కాస్త బడలిక తీరగానే మళ్లీ లేబొరేటరీ పిలుస్తుంది. సూదంటు రాయిచేత ఆకర్షింపబడే ఇనుపముక్కలా అందులో ప్రవేశిస్తాడు. ఈగల్లా ముసురుకుంటున్న ఆలోచనలని అణచటానికి ప్రయత్నిస్తున్న రాజశేఖరానికి ఎప్పుడు పట్టిందో కాస్త కునుకు పట్టింది. ఆ నిద్రలోనే ఓ పక్క ఇనుమూ ఓ పక్క బంగారమూ కనిపించాయి. ఇనుమంతా పోయి ఒక్క బంగారమే కనిపించాలని అతని ఆశ. కాని కలలోకూడా ఇనుము కనిపించడంతో ఒక్కసారి అతనికి మెలకువ వచ్చింది. బద్ధకంగా ఒళ్లు విరుచుకుని ముందు గదిలోకి వచ్చాడు.

రాజశేఖరానికి మళ్లీ విమల పెళ్లి జ్ఞాపకం వచ్చింది. చప్పుడు చెయ్యకుండావెళ్ళి ఆమె వెనకగా నుంచున్నాడు. కిటికీలోంచి కనిపించిన దృశ్యం అతణ్ణి ఆశ్చర్య చకితుణ్ణి చేసింది. గేటుముందర ఆగివున్న ఎర్రస్కూటరుమీద కూచుని విమలవంకే చూస్తున్నాడు కుర్రాడు. గేటుపక్క పాకలోంచి బయటికి పరుగెత్తుకు వచ్చిన అసిరమ్మని జుట్టు పట్టుకుని వీపుమీద గుద్దుతున్నాడు చంద్రిగాడు. అసిరమ్మా, అసిరమ్మతోపాటు పిల్లలూ బిగ్గరగా ఏడుస్తున్నారు.

ఒక్కఉదుటున వెనక్కి తిరిగాడు రాజశేఖరం. 'బ్రాకెట్లు పిచ్చి వదులుకోలేక అసిరమ్మని తంతూ వుండే తాగబోతు చంద్రిగాడు. తన్నులు తింటున్నా సినిమాలు చూడటం మానలేని అసిరమ్మ. చివాట్లు పెట్టినా గేటుదగ్గర ఆగకుండా వుండలేని ఎర్ర స్కూటరు కుర్రాడు. కిటికీలోంచి చూడటం తప్పన్నా గ్రహించుకోలేని విమల-ఏమిటో ఈ మనుష్యులు. అందరి మనస్తత్వమూ ఒకటే.' బరువెక్కిన ఆలోచనలతో అడుగుముందుకు వేశాడు రాజశేఖరం.

'అప్పుడే లేచిపోయావా నాన్నా!' ఎప్పుడు చూసిందో వెంటవస్తూ అంది విమల. 'హాయిగా విశ్రాంతి తీసుకోక ఎందుకొచ్చిన బాధ చెప్పు. శతాబ్దాల తరబడి ఎందరో సైంటిస్టులు కృషి చేసి ఆశ వదులుకున్నదాన్ని నువ్వు సాధించగలవా? నీ పిచ్చిగాని ఇనుము ఇనుమే బంగారం బంగారమే. హాయిగా కృష్ణారామా అంటూ కూర్చోక ఎందుకు నాన్నా నీకీ శ్రమ.'

తాపీగా అంది విమల.

'నిజమే తల్లీ. నాది వృథా శ్రమలాగే వుంది. రేపటినుంచీ లేబొరేటరీలో చస్తే అడుగుపెట్టను. ఇదిగో ఇవ్వాళ్టికి ఈ ఒక్క రియాక్షను చూసి వచ్చేస్తాను.'

రాజశేఖరం వెనక్కి తిరకుండా లేబొరేటరీలోకి వెళ్లాడు. తండ్రి వెళిన వైపే చూస్తూ ఒక్క నిట్టూర్పు విడచి ఏదో జ్ఞాపకం వచ్చిన దానిలా కిటికీ దగ్గరకు నడిచింది విమల.

---